# గాలి

అంత హడావుడి ఎందుకంటే ఆ భవనంలోకి మంత్రిగారు దిగబోతున్నారు. ఇక నుంచి నెలకు వారం రోజులు ఆయన అక్కడే ఉంటారట! అందుకని భవనాన్ని సకల సౌకర్యాలతో నింపి...అందంగా అలంకరిస్తున్నారు.

"ఎవడ్రా అక్కడ?..." ఏర్పాట్లు చూస్తున్న ఆఫీసర్ చంద్రమౌళి పిలుపు అది.

దొరలకు, ఆఫీసర్లకు పిలుపులో భేదం లేదు.

లోతైన కళ్ళు, సన్నబడిన కాయం, సన్నబడని వినయంతో వచ్చాడో మనిషి.

అతను భవనం కాపలా మనిషి.

"పిలచింద్రా సార్..."

చేతులు కట్టుకొని వినయంగా అడిగాడు.

"నరసింహం సార్‌ను పిలువు..."

చంద్రమౌళి కింద ఆఫీసర్  నరసింహం.

ఆ బంగళా ఏర్పాట్లలో చంద్రమౌళికి తోడుగా వచ్చాడు.

నరసింహం వచ్చే సరికి బంగళా ముందు లాన్‌లో నిల్చున్న చంద్రమౌళి మొహం ప్రసన్నంగా లేదు.

"ఇక్కడంతా ఏదో వాసన వస్తున్నది నరసింహం..." ముక్కు చిట్లిస్తూ అన్నాడు.

"అవున్సార్... అవునవును..."

"మరి ఎక్కడిదీ వాసన?...."

"ఒక్క విషయం చెప్పమంటారా సార్..." పై ఆఫీసర్ అనుమతిని అడిగాడు నరసింహం.

"ఊఁ... చెప్పు..."

"ఇది పాత బంగళా సార్..."

"బూజులు దులిపించాం కదా..."

"రంగులు వేయించాలి సార్... మీరు ఊఁ అనండి. రెండు రోజుల్లో వేయిస్తాను..."

"ఊఁ..." అన్నాడు చంద్రమౌళి.

రంగులు వేసే వాళ్లకేం కొదువ! పదుల సంఖ్యలో దిగారు.రెండు రోజుల్లో రంగులతో బంగళా ముస్తబయింది.

బంగళా అంతా తిరిగి చూసిం తర్వాత ఆఫీసర్ చంద్రమౌళి అసహనంగానే కనిపించాడు. బంగళా బాల్కనీలో నిల్చుని నరసింహాన్ని పిలిపించుకున్నాడు.

ఆఫీసర్ కోపంగా ఉన్నాడని తెలిసి బిక్కమొహంతో వచ్చాడు నరసింహం.

లోపం బంగళా ఏర్పాటులోనా... ఆఫీసరుకు చేయాల్సిన ఏర్పాట్లలోనా అర్థం కాలేదు నరసింహంకు.

"ఏవిటయ్యా ఇది!... ఇంకా వాసన వస్తున్నదేం?..." చిరాగ్గా అడిగాడు చంద్రమౌళి.

"నిజం చెప్పమంటారా సార్?..." పై ఆఫీసరు అనుమతి అడిగాడు నరసింహం.

"ఊఁ..."

"బంగళా ముందు రోడ్డు ఉన్నది కదా సార్..."

"ఊఁ..."

"ఆ రోడ్డు శుభ్రం చేయించి కొత్త రోడ్డు వేయించాలి సార్..."

"అలాగా..."

"అవున్సార్..."

"అయితే కానీ..."

అటువంటి సమయాల్లో నరసింహం మొహం బాగా వికసిస్తుంది. చేయించే పనులు ఎంత పెరిగితే అంత వికాసం!

మరో రెండు రోజుల్లో రోడ్డు రోలర్ దిగింది. కంకరరాళ్లు...కంకరపరం దిగాయి.... తారు పీపాలు గునగున ఏనుగు పిల్లల్లా వచ్చాయి.

బంగళా ముందు అందంగా, నున్నగా రోడ్డు తయారైంది.

ఈసారి పెద్ద ఆఫీసర్ తనను మెచ్చుకోవడం ఖాయం అనుకున్నాడు చిన్న ఆఫీసర్ నరసింహం.

కాని... ఆఫీసర్ చంద్రమౌళి ఇంకా అసహనంగానే బాల్కనీలో పచార్లు చేస్తున్నాడు.

అతనికి తన పై ఆఫీసరైన కలెక్టర్ మొహం. ఆ పైన మంత్రిగారి మొహం అప్రసన్నంగా కనిపిస్తున్నాయి మరి!

నరసింహం రాగానే -

"ఏమిటయ్యా ఇది?... " అని విసుక్కున్నాడు చంద్రమౌళి.

బిక్కమొహం వేశాడు నరసింహం.

"వాసన ఇంకా వస్తున్నది చూశావా!..." చిరాకుగా అన్నాడు చంద్రమౌళి.

చిరాకులు పరాకులు ఆఫీసర్ల ముఖ్య లక్షణాలని నరసింహంకు బాగానే తెలుసు...! అందుకే అంతగా కంగారు పడలేదు...

"ఒక మాట చెప్పమంటారా సార్..." పై ఆఫీసర్‌ని అనుమతి అడిగాడు నరసింహం.

"ఊఁ..."

"చెప్పనా సార్..."

"ఊఁ..."

"ఈ వాసన రోడ్డు కవతల నుంచి వస్తున్న వాసన సార్..."

"అవునా?.."

"అవున్సార్..."

"ఎలా పోతుందది?"

"చెప్పమంటారా సార్..."

"చెప్పమనేగా అడిగేది..."

"బంగళా ముందు రోడ్డు ఉంది కదా సార్..."

"మొన్ననే వేయించాం..."

"అవున్సార్...ఆ రోడ్డుకు అవతల అటు ఫర్లాంగు ఇటు ఫర్లాంగు మేర పూల మొక్కలు... క్రోటన్ మొక్కలు పెట్టించాలి సార్... అప్పుడు బంగళాకు మంచి గాలి వస్తుంది... సువాసనగా ఉంటుంది...." అని సలహా ఇచ్చాడు నరసింహం.

చంద్రమౌళి తలూపాడు. నరసింహంకు పచ్చజండా ఊపినట్లు అనిపించింది.

సలహా ఆఫీసర్లు చాలా పవర్‌ఫుల్! వారు పై ఆఫీసర్ల చేత, మంత్రుల చేత తిమ్మిని బమ్మి... బమ్మిని తిమ్మి చేయించగల సమర్థులు! కంకర రోడ్డును తారురోడ్డు చేయించగలరు. తారు రోడ్డును కంకరరోడ్డు చేయించగలరు కూడా!!

వారం రోజుల్లో... మంత్రిగారు దిగబోయే బంగళా ముందు రోడ్డుకు అవతల ఇవతల రెండు ఫర్లాంగుల మేర పూలమొక్కలు... క్రోటన్ మొక్కలు బారులు తీరాయి!

వాటివంక చూస్తూ ఆఫీసర్ చంద్రమౌళి బంగళా బాల్కనీలో నిల్చునాడు -

అంతలోనే మొహం చిట్లించాడు.

"ఎవరక్కడ..."

ఈ సారి చిన్న ఆఫీసర్ నరసింహం రాలేదు. బిక్షపతి వచ్చాడు. లోతైన కళ్ళు... సగమైన కాయం...

ఎదురుగా డబుల్ కాయం... డబుల్ దుస్తులు... డబుల్ చిరాకుతో ఆఫీసర్ చంద్రమౌళి.

"పిలిచింద్రా సార్..."

"ఆఁ..."

"చిన్న సార్‌ను పిల్చుకరానా సార్..."

పెద్దసారు మాట్లాడలేదు.

"ఈ వాసన ఇంకా వస్తున్నదేం..." అంటూ గొణిగాడు.

"అవున్సార్..."

"బంగళాకు రంగులు వేయించాం... బంగళా ముందు లాన్ బాగు చేయించాం.... రోడ్డు కొత్తది వేసాం.... రోడ్డు కవతల పూలమొక్కలు పెట్టిస్తిమి... ఇంకా వాసన పోదేం"...

"సీసాల కొద్దీ అత్తరు సీసాలు గుమ్మరించినా అప్పటికప్పుడు సువాసనగ ఉంటదేమో కాని... ఈ మురికి వాసన ఇట్లా వస్తనే ఉంటది సార్... అది గాలి వాసన సార్..." అన్నాడు బిక్షపతి.

"ఎక్కణ్ణుంచి వస్తున్న గాలి వాసన?..." దానికి అతనే కారణమైనట్లు బిక్షపతి వంక కోపంగా చూశాడు ఆఫీసర్ చంద్రమౌళి.

అటువంటి కోపాలెన్నో దిగి దిగి లోతైపోయిన బిక్షపతి కళ్లు నిదానంగా చూశాయి.

"రోడ్డుకు అవుతల పూలమొక్కలు పెట్టించిండ్లు కద సార్..."

"అవును..."

"వాటి అవుతల ఏమున్నయో చూసిండ్లా సార్?..."

"ఏమున్నయ్?..."

"పూరి గుడిసెలు... మురికి కాలువ... అక్కణ్ణించి గాలి తెస్తాంది సార్ మురికి వాసన..."

"అయితే ఆ పూరి గుడిసెల్ని పీకేస్తే సరి..." అంటూ వచ్చాడు సలహాల చిన్న ఆఫీసర్ నరసింహం.

చిన్నగా నవ్వాడు బిక్షపతి.

"అంతపని చేస్తే ఏండ్ల తరబడి అక్కడ ఉన్న జనం ఊర్కుంటరా...పత్రికలు ఉర్కుంటయా... మంత్రిగారి బంగళా కోసం జనం బతుకుల్ని బుగ్గి చేసిండ్లని గగ్గోలు పుడుతది... మంత్రికి చెడ్డపేరు వొస్తది... అసలు బంగళనే ఉంచరు జనం... కూలగొట్టేస్తరు..."

"ఏయ్... ఏం మాట్లాడ్తున్నవురా నువ్?"

బిక్షపతి భయపడలేదు.

"నిజం మాట్లాడితే గంత కోపం ఎందుకు సార్... గింత ఖర్చు పెట్టి గిన్ని షోకులు చేసేటోళ్లు.. గామాత్రం ఖర్చుపెట్టలేరా?... గా గుడిసెల్ని బాగుచేయిన్రి... మురికి కాలువను మూయించండ్రి.... డ్రైనేజీ తొవ్వించండ్రి...ఏ బంగళాకూ దోమల బాధ ఉండది..."

"..........."

"వాడలు బాగుంటేనే బంగళాలు బాగుంటయి సార్... రోడ్డు బాగుంటె కాదు..." ధైర్యంగా అన్నాడు బిక్షపతి....బంగళా కాపలా మనిషి.

నరసింహం నోట మాట రాలేదు.

ఆలోచనలో పడ్డాడు ఆఫీసర్ చంద్రమౌళి.

ఆదివారం ఆంధ్రజ్యోతి, *22-4-2007*